# దూరదర్శనాలు

అనంతం విదేశీ మందుల కంపెనీలో రిప్రజెంటేటివ్‌గా చేరిన లగాయితూ అతని అంతస్తే పూర్తిగా మారిపోయింది- వస్తుతా పటాటోపం యిష్టంలేనివాడే- అయితే కంపెనీ మర్యాదకు తగ్గట్టు, తన హోదాకు తగ్గట్టు వేషభాషల్లో మార్పు తెచ్చుకోవడం తప్పనిసరయింది. మూడేసి మాసాలకోసారి నగరంలో రీజనల్ కాన్ఫరెన్సులు జరుగుతాయి. దానికి హాజరయినందుకు కంపెనీవాళ్ళే ఖర్చులన్నీ భరిస్తారు. స్టార్ హోటల్లో బసచేయడం అవసరం. అందువల్ల అనంతం పెద్ద హోటల్లోనే బస చేస్తూ వుంటాడు.

ఒకసారి కాన్ఫరెన్సుకు వచ్చినప్పుడు అనంతానికి విచిత్రానుభవం అయింది.

అనంతం, బెంగుళూరునుంచి వచ్చిన రిప్రజెంటేటివ్ నారాయణ, యిద్దరూ కలిసి హోటల్లో డబుల్ రూం బుక్ చేసుకున్నారు. లోగడ ఒక చిన్న కంపెనీలో వున్నప్పుడు నారాయణకూ సహోద్యోగి అనంతానికీ మంచి స్నేహం.

ఆ హోటలు చాలా పెద్దది. ఆధునికమైన హంగులన్నీ వున్నాయి.

హోటల్లో దిగినవాళ్ళకి పక్కన ఎవరు దిగిందీ తెలియదు. తెలుసుకోవాల్సిన అవసరంగాని కుతూహలంగాని సామాన్యంగా వుండదు

అనంతం, నారాయణ డ్రస్ చేసుకుని వుదయం కాన్ఫరెన్సుకు బయలుదేరుతుండగా ఒక యువతిని పక్కగది గుమ్మందగ్గర చూశారు. ఆమెకు ముప్పయి సంవత్సరాలకు లోపుగా వుంటాయి. అందమైన ముఖం, అలంకరణను బట్టి ఇండియనే అని తెలుస్తోంది.

మిత్రులిద్దరూ అటువేపు చూశారు గాని తిరిగి ఆమెను గురించి ఏమీ చర్చించుకోలేదు.

సాయంకాలం నాల్గింటికి తిరిగి వచ్చారు. స్నానంచేసి, డ్రెస్ చేసుకుని, కాఫీ తాగి బీచికి షికారు వెళ్ళారు.

ఏడు గంటలకు తిరిగి వచ్చారు. భోజనం అయ్యాక కబుర్లు చెప్పుకుంటూ రూంలో కూర్చున్నారు.

ఎనిమిదిన్నరవుతోంది. ఇద్దరకూ నిద్ర ససేమిరా రావడంలేదు. ఏమీ తోచడంలేదు. పోనీ సెకండ్ షోకి పోదామా అని ఆలోచిస్తున్నారు.

ఇంతలో పక్క గదిలోంచి ఏదో ధబేలున పడ్డట్టు చప్పుడయింది. అనంతం, నారాయణ మాటలు ఆపుచేశారు.

పక్క రూంలోంచి స్త్రీ కంఠం వినిపించింది. "అయ్యయ్యో" అని.

మిత్రులిద్దరూ ఏమీ విమర్శించ లేకపోయారు. తిరిగి కబుర్లకు

పుపక్రమించలేదు. ఆ పక్క రూంలో నుంచి ఎవర్నో కొట్టున్నట్టు శబ్దం వినిపించింది.

మిత్రులు కొంచెం ఖంగారుపడ్డారు. ఏమిటా అని ఆలోచిస్తున్నారు. ఏమి పాలుపోలేదు. అలాగే నిఘాగా వింటున్నారు. వాళ్ళ గుండెల్లో రక్తంమాత్రం కొంచెం వేగంగా పరుగెత్తడం ప్రారంభించింది.

పక్క రూంలో గబగబా అడుగులు వేస్తున్న ధ్వని వినిపించింది. తరుముతూవున్న కాళ్ళ చప్పుడు వినపడింది. మంచంపైకి దూకి తిరిగి కిందకు దూకుతున్నట్టు, కుర్చీలు బరబరాలాగి పక్కకు నెట్టుతున్నట్టు వినిపించింది.

ఏదో గొడవ జరుగుతున్నట్టు మిత్రులు సందేహపడ్డారు. కాని బయటికి రాలేదు. ఏమి చేయడానికి ఆలోచన కలగడంలేదు.

ఇంతలోకే ఎవరో దభీమని పడ్డట్టు చప్పుడయింది. గాజులు పగిలిన అలికిడయింది. స్త్రీ బాధగా 'చంపేశావ్' అన్నమాట వినపడింది.

అంతే— తిరిగి పక్క రూంలోంచి యింకేమీ వినపడలేదు.

అనంతం హడిలిపోయాడు. నారాయణ నెత్తిన పిడుగుపడినట్టయింది. కళ్ళు పెద్దవి చేసి ఒకరివంక ఒకరు వెర్రిచూపులు చూసుకుంటున్నారు. కొద్ది నిమిషాలవరకు ఎవరికీ మాట పెగిలిరాలేదు. మర్డరు గురించి రోజూ పేపర్లో రకరకాల వార్తలొస్తుంటాయి. ఎందుకో ఇద్దరూ భయభీతులయ్యారు. అనంతం ధైర్యం చిక్కబట్టుకుని అన్నాడు- 'పదరా నారాయణ, ఏమిటో కనుక్కుందాం'

నారాయణకి అసలే అనుమానం, భయం జాస్తీ. ఏదోవిధంగా కొంచెం తెప్పరిల్లి, వణికిపోయే కంఠంతో "ఒరేయ్! అసలు సంగ

తేమిటో ! ఇలాంటి ప్రమాదాల్లో ముందు జాగ్రత్త అవసరం. ఖూనీగట్రా అయితే మనిద్దరం యిరుక్కు చస్తాం....మేనేజరు కూడ మనతో వుండడం మంచిది' అన్నాడు- అనంతం అంగీకరించినట్టు ముఖం పెట్టాడు.

వెంటనే తన రూంనుంచే మేనేజరుకు ఫోనుచేసి పదోనెంబరు రూండగ్గరికి తక్షణం రమ్మనమని ఖంగారుగా చెప్పాడు. మేనేజరు వెంటనే బయలుదేరుతున్నానన్నాడు.

మిత్రులిద్దరూ బయటికి వచ్చి పక్కరూం తలుపుదగ్గర నుంచున్నారు. మేనేజరు కూడా వచ్చాడు——

తమ సందేహాన్ని రెండుముక్కల్లో మేనేజరుకి చెప్పి పక్కరూం తలుపుతట్టారు దబదబా. లోపలనుంచి స్త్రీ కంఠం 'కమింగ్, కమింగ్' అని జవాబు చెప్పింది.

మరుక్షణంలో చక్కటి కుక్కపిల్లను చంకన పెట్టుకుని ఉదయం చూసిన యువతి తలుపు తీసింది - ముగ్గురూ వెలగపిందెలు తిన్నట్టయిపోయారు- నోటమాటరాలేదు-

ఆమె ఏమీ తెలియక ప్రశ్నార్థకంగా చూసి ఎవరు కావాలని అడిగింది.

అనంతం 'క్షమించండి చాలా పొరపాటుపడ్డాం. ఏమిటో తెలియక ఖంగారుపడి తెలుసుకుందామని తలుపుతీయించాం. అన్యథా భావించక మన్నించండి, మేం పక్కరూంలో వుంటున్నాం.... వీరు మేనేజరుగారు' అనగలిగాడు.

ఆ యువతి పక్కున నవ్వింది. చేతిలో వున్న పప్పీమీద ముద్దుగా ఒకదెబ్బ వేస్తూ 'సారీ, యీ పప్పీ చేసిన తంతు ఇదంతా, మావారు ఎవరో స్నేహితుడి యింటికి వెళ్ళారు. నేనేం తోచక చదువుకుంటున్నా, ఇంతలోనే పప్పీ టేబుల్ మీదఎక్కి ఫ్లాస్కు పడతోసింది. దాన్ని పట్టుకుని రెండు అంటించా. తుర్రుమని పారిపోయింది. ఇంకేం పడేస్తుందోనని పట్టుకుందామని ప్రయత్నం చేయడంలో కుర్చీతగిలి పడ్డాను. దెబ్బ

తగల్లేదనుకోండి. కొంచెం నొప్పి ఎక్కితే పప్పీ నుద్దేశించి 'చంపేశావ్' అన్నా. ఇంతే మరేంలేదు' మరోసారి పక్కున నవ్వింది.

ఇంతలోకే ఆమె భర్త వచ్చాడు. ఈ తమాషా అంతావిని ఆయన కూడా అందరితోపాటే పెద్దగా నవ్వి రూంలోకి వెళ్ళిపోయాడు ఆమె వెనక.

మేనేజరు కూడా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు-

అనంతం, నారాయణ తమరూం తాళంవేసి సెకండ్‌షోకి బయలు దేరారు. *

(1956)